ANDHRA JOYTHI 30 AUG 2010

# పీవీ మంచి సాహితీవేత్త: రోశయ్య

హైదరాబాద్, ఆగస్టు 29(ఆన్‌లైన్): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గొప్ప పరిపాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడే కాకుండా మంచి సాహితీవేత్త అని సీఎం రోశయ్య కొనియాడారు. పీవీ నరసింహారావు అంతర్జాతీయ ఫౌండేషన్ హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రముఖ పర్యావరణ కార్యకర్త సద్గురు జగ్గీ వాసుదేవ్‌ను సన్మానించారు. ఆయన రాసిన 'మిడ్‌నైట్ మిస్టేక్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సందర్భంగా సీఎం రోశయ్య ప్రసంగించారు. ప్రకృతిని పీవీ అమితంగా ప్రేమిస్తారని, ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తూనే మొక్కలను పెంచేవారని తెలిపారు. పీవీ మంచి రచయిత, అద్భుతమైన అనువాదకుడని ప్రశంసించారు. వాసుదేవ్ మాట్లాడుతూ.. చెట్టు ఉనికితోనే మనిషి బతుకు ముడిపడి ఉందన్నారు. తమ సంస్థ ద్వారా 20 లక్షల మంది వాలంటీర్లతో పదికోట్ల మొక్కలను ఆయా రాష్ట్రాల్లో నాటించగలిగామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ గవర్నర్ రమాదేవి, మాజీ ఎంపీ పీవీ రాజేశ్వరరావు, ప్రభుత్వ ఐటీ సలహాదారు త్రిపురనేని హనుమాన్ చౌదరి తదితరులు హాజరయ్యారు.



'మిడ్‌నైట్ మిస్టేక్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రోశయ్య